క్లుప్తంగా

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బిక్కవోలు: ఇటీవల కరెంట్ షాక్ కారణంగా గాయాల పాలైన బాధితుడికి వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్థిక సాయం అందించారు. తొస్సిపూడి గ్రామానికి చెందిన పల్లి రాముడు ఉపాధి పనుల్లో భాగంగా పంచాయతీ వద్ద పనిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురి కావడంతో స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న రాముడికి వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రూ.12 వేలు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తేతలి సూర్యచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లోరినేషన్ చేసిన తాగు నీటిని సరఫరా చేయాలి



సచివాలయ కార్యదర్శికి క్లోరోస్కోపు పరికరాన్ని అందజేస్తున్న ఎంపీడీఓ ఆశాజ్యోతి

పెదపూడి: ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని రోజూ క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలని ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి నాణ్యతను పరిశీలించే క్లోరోస్కోపు కిట్లను సచివాలయ కార్యదర్శులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు సరఫరా చేస్తున్న నీటిని క్లోరినేషన్ చేశారా లేదా అని క్లోరోస్కోపు సాయంతో పరీక్షించి చూడాలన్నారు. వాటర్ ట్యాంక్ ఎన్ని రోజులకు శుభ్రం చేస్తున్నారో పరిశీలించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యానారాయణరెడ్డి, సచివాలయ కార్యదర్శులు యాళ్ల ఉమామహేశ్వరరావు, మన్యం శ్రీనివాసుచౌదరి, నాగేంద్ర, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పట్టిన డయేరియా



సీతానగరంలో డిశ్చార్జి అయిన మహిళను ఆరా తీస్తున్న డాక్టర్ చైతన్య

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో నమోదైన 16 డయేరియా కేసులు రెండుకు తగ్గుముఖం పట్టాయని పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య తెలిపారు. సీతానగరంలో చికిత్స అనంతరం డిశ్చార్జి అయిన వారి ఇళ్లకు మంగళవారం డాక్టర్ చైతన్య వెళ్లి ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో నమోదైన కేసుల్లో 14 మంది చికిత్స అనంతరం డిశ్చార్జి అయ్యారన్నారు. ఇద్దరు రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. గ్రామంలో నాలుగు వైద్య బృందాలు ఇంటింటికీ తిరిగి సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. రెండు వైద్య శిబిరాలను మరో వారం రోజుల పాటు కొనసాగిస్తామన్నారు. కొత్తగా డయేరియా కేసులేమీ లేవని, వ్యాధి అదుపులోకి వచ్చిందని స్పష్టం చేశారు.

అందరి సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి



రంగంపేట మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రంగంపేట: అందరి సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో వైస్ ఎంపీపీ రాయుడు రాంబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల పరిషత్ సాధారణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయం, గృహ నిర్మాణం, ఉపాధిహామీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్య, వైద్యం, పశు వైద్యం, ఐసీడీఎస్, విద్యుత్ తదితర శాఖల అధికారులు తమ శాఖల ఉన్నతిని సభకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లోని సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఇప్పటివరకూ మండల ఎంపీడీఓగా పనిచేసి పదవీ విరమణ పొందిన బి.శ్రీరామరాజుని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ముఖలింగం, తహసీల్దార్ లతీఫ్‌పాషా, ఎంపీడీఓ పి.వెంకటరత్నం, వైస్ ఎంపీపీ మట్టా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాత మార్చే.. భాగ్య రేఖ

- ఉప్మా బడి కాదు.. బాలల భవితకు పునాది
- అంగన్‌వాడీల్లో ప్రీ ప్రైమరీ విద్యా విధానం
- తెలుగు, ఆంగ్ల భాషలతో విద్యా బోధన
- చిన్నారులకు వరంలా గత పాలకుల కార్యాచరణ



రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న విద్యా బోధన

రాజానగరం: ఒకప్పుడు ఉప్మా బడులుగా పిలిచిన అంగన్‌వాడీ కేంద్రాలు నేడు కార్పొరేట్ స్కూళ్లను మరిపించే రీతిలో చిన్నారులకు నర్సరీ విద్యను అందిస్తున్నాయి. తెలుగు, ఇంగ్లిష్ భాషలను నేర్చుకునేందుకు వీలుగా ఆధునిక విద్యా బోధనతో అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారి చిన్నారులను ఆకట్టుకుంటున్నాయి. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రెయిమ్స్, నీతి కథలను పాడుతూ, తదనుగుణంగా ఆడుతూ చిన్నారులు ఉల్లాసంతో ఉరకలేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంతవరకు అమలు జరిగిన మూస విద్యా విధానానికి స్వస్తి పలికి, చిన్నారుల్లో ఆలోచనలను రేకెత్తిస్తూ, మేథో శక్తిని పెంపొందించేలా ప్రగతి పథంలో పరుగులు తీస్తున్నాయి.

తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో బోధన పరికాలు

మనిషి ఎదుగుదలకు బాల్యం పునాది. వారికి బంగారు భవిష్యత్తు కోసం బాల్యంలోనే సరైన విద్యను అందించాలనేది గత ప్రభుత్వ ఆలోచన. ఇందుకు అవసరమైన కార్యక్రమాలపై దృష్టిని మళ్లిస్తే ఇక జీవితంలో వెనుదిరిగే పని ఉండదని గత పాలకులు భావించడంతో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యా బోధనల తీరే మారిపోయింది. అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న విద్యా విధానాన్ని పరిశీలించడంతో పాటు, విద్యారంగ నిపుణులతో సంప్రదింపులు చేసి, కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన విద్యా విధానం అమలుకు రాష్ట్రంలో శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా టీచర్లు చేసే బోధన విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేందుకు, వాటిని పిల్లలు జ్ఞాపకం ఉంచుకునేందుకు వీలుగా ప్రీ ప్రైమరీ స్కూల్ కిట్లను కూడా విద్యార్థులకు అందజేశారు.

తూర్పుగోదావరి జిల్లాలోని 1,556 కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్ల వయస్సు ఉన్న 30,663 మంది చిన్నారులకు ఈ కిట్లను అందజేశారు. రెయిమ్స్, నీతి కథలను తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ప్రత్యేకంగా ముద్రించిన పుస్తకాలు, కలర్ కార్డులు, బిల్డింగ్ బ్లాక్స్, ఫ్లాష్ కార్డులు, పోస్టర్లు, చార్ట్స్, లెర్నింగ్ కిట్లు వీటిలో ఉన్నాయి. అలాగే అక్షరాలతో పాటు, అంకెలు, రంగులు, జంతువులు, పక్షులు తదితర వాటిని తేలిగ్గా గుర్తించి, జ్ఞాపకం ఉంచుకునేలా బోధనా సామగ్రిని కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేశారు.

సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

ఆధునిక బోధన పరికరాలను అందించడమే కాకుండా, వాటిని వినియోగించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సరైన అవగాహన ఉంటేనే వాటి ప్రయోజనం చిన్నారులకు అందుతుందని అధికార యంత్రాంగం భావించింది. దీంతో ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బందికి అవసరమైన శిక్షణా తరగతులను మండలాల వారీగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా డిగ్రీలు చేసి, శిక్షణ పొందిన టీచర్లు ఇక్కడ ఉండరు. అందువల్ల అందుబాటులో ఉన్న వారికే నర్సరీ బోధనపై ఉన్నత స్థాయి శిక్షణను అందించారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం బోధనకు అభ్యసన కరదీపిక, పరిసరాల విజ్ఞానం పుస్తకాలను, ఇంగ్లిష్ వర్కు, చిత్రలేఖనం పుస్తకాలను ఉచితంగా సరఫరా చేశారు. వీటితో పాటు కొంతమంది మానసిక వైకల్యం కలిగిన చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, తరచూ వైద్యసేవలు అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారంతో పాటు, బాలామృతం అందిస్తూ, ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించేలా తగిన చర్యలు తీసుకున్నారు.

ఎంతో ఉపయుక్తం



చిన్నారులను బడికి సంసిద్ధులను చేయడానికి, వారి సంపూర్ణ అభివృద్ధికి, మేథస్సు పెంపునకు ప్రీ స్కూళ్ల విద్యా విధానం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ముఖ్యంగా మూడు నుంచి ఆరేళ్ల చిన్నారుల్లో మెదడు వేగంగా అభివృద్ధి చెందుతుంది. ఈ దశలో వారికి అవగాహనతో కూడిన విద్యను అందించాల్సిన అవసరం ఉంది. తద్వారా భవిష్యత్తులో వారికి ఎన్నో ప్రయోజనాలుంటాయి. మేథోశక్తి పెరుగుతుంది. ఇంట్లో ఉన్నామనిపించేలా విద్యా బోధన సాగుతుంది. ఆట, పాటలతో విద్యనేర్పడం ద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎంతో అభివృద్ధి సాధిస్తారు.

– టి.నాగమణి, సీడీపీఓ–ఐసీడీఎస్, రాజానగరం

కాపవరంలో డయేరియా



కాపవరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు విజయలక్ష్మి

బిక్కవోలు: మండలంలోని కాపవరంలో మంగళవారం డయేరియా కలకలం రేగింది. గ్రామంలో అనేకమంది వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు తెలియడంతో కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు జి.విజయలక్ష్మి తన సిబ్బందితో కలిసి వైద్య శిబిరం నిర్వహించారు. డీఎల్‌పీఓ నాగలత, ఈవోపీఆర్డీ భవాని, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బాల శంకరావు, డీఈఈ రవికుమార్ గ్రామంలో పర్యటించారు. మంచినీటి పథకం నుంచి నీటి సరఫరా నిలుపుదల చేసి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించారు. డ్రైనేజీల్లో పూడికలను తొలగించి గ్రామంలో బ్లీచింగ్ చల్లించారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని దండోరా వేయించారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం లేదని వైద్యురాలు విజయలక్ష్మి తెలిపారు.

11న చెస్ పోటీలు

పెదపూడి: ఈ నెల 11వ తేదీన అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో బాలబాలికలకు జిల్లా స్థాయి అండర్–10, 15 విభాగాల్లో చెస్ పోటీలు నిర్వహించనున్నామని ఎస్ఈఎస్ఎస్‌సీఓ ట్రస్ట్ చైర్మన్ నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. పోటీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 81794 60178, 98850 82859 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ



పెద్దాడలో బాధితులకు బియ్యం బస్తా అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: మండలంలోని పెద్దాడ గ్రామంలో ఈ నెల 7వ తేదీ రాత్రి ఏలుచూరి అర్జున్ ఇంటిలో గ్యాస్ సిలెండర్ పేలి ఇల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం పరామర్శించి రూ.2,000 ఆర్థిక సాయం, 25 కేజీల బియ్యం బస్తా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ సిలెండర్ ప్రమాదం సంభవించినప్పుడు నిబంధనలను అనుసరించి సంబంధిత గ్యాస్ కంపెనీ బాధితులకు నష్ట పరిహారం చెల్లిస్తుందన్నారు. ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకుని బాధితులకు నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దోకుబుర్ర మీనాక్షి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ సాంబత్తుల చంటి, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, దోకుబుర్ర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతపై అవగాహన అవసరం



సెమినార్‌లో మాట్లాడుతున్న ఆచార్య సుధాకర్

రాజానగరం: ప్రతి ఒక్కరూ ఆహార భద్రతపై అవగాహన పెంచుకోవడంతో పాటు, ఆరోగ్య పరిరక్షణకు సరైన ఆహారాన్ని తీసుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ అవేర్నెస్–స్టాప్ డయేరియా క్యాంపెయిన్–2024 అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. అతిసారం, దాని నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గైట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.మనోహర్ బాబు, కో–ఆర్డినేటర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ పీఓ డాక్టర్ శీలం రాజ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ కె.సుజాత, డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

- డీడీఏ మోహనరావు



రఘుదేవపురంలోని ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న డీడీఏ

సీతానగరం: రైతులకు నాణ్యత లేని పురుగు మందులు, ఎరువులను దుకాణదారులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఎ.మోహనరావు హెచ్చరించారు. మంగళవారం రఘుదేవపురం, బొబ్బిల్లంకల్లో ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బి.సింహాచలంతో కలిసి ఆయన తనిఖీ చేశారు. రఘుదేవపురంలో లక్ష్మీ వేంకటేశ్వర ఫర్టిలైజర్స్ అండ్ జనరల్ స్టోర్స్, బొబ్బిల్లంకలో శ్రీదేవి సత్య ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఎరువుల నాణ్యత పరిశీలనకు శాంపిళ్లను సేకరించారు. ఎరువుల బస్తాలను తూకం వేసి, నిర్ణీత 50 కిలోలు ఉన్నట్టు సంతృప్తి వ్యక్తం చేశారు. ధరల పట్టీలను పరిశీలించారు. రైతులకు నాణ్యత లేని ఎరువులు, పురుగు మందులు అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. వీరి వెంట కోరుకొండ ఏడీఏ బి.మల్లికార్జునరావు, టెక్నికల్ ఏఓ శివశ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి కె.సూర్యరమేష్ ఉన్నారు.

ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి



జి.మామిడాడలో ఎరువుల షాపులో నిల్వలు పరిశీలిస్తున్న తనిఖీ అధికారులు



గోకవరంలోని ఎరువుల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పెదపూడి: ఎరువులను ఎమ్మార్పీ ధరలకే రైతులకు విక్రయించాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ శాఖ డీడీఏ కె.త్రినాథ్‌స్వామి డీలర్లను హెచ్చరించారు. మండలంలో జి.మామిడాడలోని అనంతలక్ష్మి ఏజెన్సీ ఎరువుల షాపును వ్యవసాయశాఖ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మంగళవారం తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో త్రినాథ్ స్వామి, శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ సీఏ డీవీవీ సతీష్, కాకినాడ జిల్లా వ్యవసాయశాఖ టెక్నికల్ అధికారి విజయలక్ష్మి, ఏఓ టీవీఆర్ మణిదీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎరువులు, పురుగుమందుల స్టాకు రిజిస్టర్లు, బిల్లులు పరిశీలించారు. ఈ సందర్భంగా త్రినాథ్ స్వామి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని సూచించారు. డీబీటీ పద్ధతిలోనే ఎరువులు విక్రయించాలని, కృత్రిమ కొరత సృష్టించవద్దని డీలర్లను ఆదేశించారు.

ఎరువులు, విత్తనాల షాపుల్లో తనిఖీలు

గోకవరం: మండల పరిధిలోని ఎరువులు, విత్తనాల షాపులలో మంగళవారం విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు మనోహరరావు, సీఐ సింహాచలం, ఏడీ మల్లికార్జునరావు తనిఖీలు నిర్వహించారు. పలు ఎరువుల దుకాణాల్లో రికార్డులు, గొడౌన్‌లోని ఎరువులు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. ప్రతి రైతుకు కనబడే విధంగా ఎరువులు, విత్తనాల ధరలతో కూడిన పట్టికను ఏర్పాటు చేయలన్నారు. ఏఓ శివశ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అనుచితంగా..

- ఉచిత ఇసుక విధానం ప్రారంభం
- పని చేయని వే బ్రిడ్జి
- జేసీబీ బకెట్ లెక్కలతో ఇసుక లోడింగ్
- దోచేసిన ఇసుకపై నోరు మెదపని ప్రజాప్రతినిధులు



బకెట్ లెక్కలతో ఇసుక లోడు చేస్తున్న పొక్లెయిన్

రాజమహేంద్రవరం రూరల్: ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి రాగానే టీడీపీ, జనసేన నేతలు వర్షాకాలంలో ఇళ్ల నిర్మాణం కోసం స్టాక్ పెట్టిన ఇసుకను దోచేశారు. జిల్లాలో ఏడు ఇసుక స్టాక్ పాయింట్లలో సుమారు ఎనిమిది లక్షల టన్నుల ఇసుక నిల్వ ఉండగా, ప్రస్తుతం ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చేసరికి ఆయా నేతలు దోచేసిన తర్వాత సుమారు మూడు లక్షల టన్నుల ఇసుక మాత్రమే మిగిలింది. మాయమైన ఇసుక విషయంపై మాత్రం ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం గమనార్హం. లాలాచెరువు ఇసుక స్టాక్ పాయింట్‌లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతులమీదుగా ఉచిత ఇసుక విధానాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరితో పాటు, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి, ఇన్‌చార్జి జేసీ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పని చేయని వే బ్రిడ్జి

ఇసుక స్టాక్ పాయింట్ వద్ద వే బ్రిడ్జి పనిచేయలేదు. దీంతో జేసీబీ బకెట్ రెండు టన్నుల చొప్పున లెక్క వేసి లారీల్లో లోడింగ్ చేశారు. ఇసుక ఎక్కువ వెళితే ప్రభుత్వం, తక్కువ వెళితే వినియోగదారుడు నష్టపోవాల్సిన పరిస్థితి. ఇసుక లోడింగ్, బాట చార్జీలు తదితర ఖర్చులు కలిపి టన్ను ధర రూ.270గా కలెక్టర్ నిర్ణయించారు. ఇంటి ప్లాన్, ఆధార్ కార్డుతో యజమాని క్యూఆర్ కోడ్ ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ చేశాక లారీల్లో ఇసుకను లోడింగ్ చేస్తారు.

కృత్రిమ కొరత సృష్టించేలా..

వర్షాకాలంలో ఇసుక దొరికే అవకాశం లేదు. కాబట్టి టీడీపీ, జనసేన నేతలు ఇప్పటి నుంచే సొమ్ము చేసుకునేందుకు సిద్ధమయ్యారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇప్పటివరకు స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను మాయం చేసేశారు. రూ.కోట్ల విలువైన ఇసుకను రహస్య ప్రాంతాల్లో నిల్వలు చేశారు. ఎన్నికల ముందునాటికి ఏడు స్టాక్ పాయింట్లలో 8 లక్షల టన్నులకు పైగా ఇసుక నిల్వలున్నాయి. ఇప్పుడు కేవలం మూడు లక్షల టన్నులు మాత్రమే ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుక విక్రయాలు పూర్తయితే, ముమ్ముందు వర్షాకాలంలో ఇసుక కొరత ఉంటుంది. ఈ సమయంలో దాచేసిన ఇసుకను అధిక రేట్లకు విక్రయించేలా ఆయా నేతలు ఆలోచనలో ఉన్నారు. దోచేసిన ఇసుకపై ఎటువంటి చర్యలు తీసుకుంటారని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, గతంలో జరిగిన విషయం తమకు సంబంధం లేదని, ఇప్పటి నుంచి జరిగేదే లెక్కలో ఉంటుందని చెప్పడం విశేషం.

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం చవితి సందర్భంగా స్వామివారికి అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్న సమారాధన చేశారు.



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సార్వా వరికి ఎండాకు బెడద

- యాజమాన్య పద్ధతులే శరణ్యం
- ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు



రాజానగరం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు తెగుళ్ల బెడద ప్రారంభమైంది. కొన్ని ప్రాంతాల్లో ఆకు ఎండు తెగులు (క్రైసక్ దశ) ఆశించినట్టుగా దివాన్‌చెరువులోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు గుర్తించారు. అత్యంత సమస్యాత్మకమైన ఈ తెగులు నివారణకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు తెలిపారు. నారు మడి దశ నుంచి నాట్లు వేసిన తర్వాత నెల రోజుల వరకు వరి పంటను క్రైసక్ దశ ఆశిస్తుందన్నారు. నారు మడిలో ఆకుల అంచుల నుంచి లోపలి వైపు నీటి డాగు మచ్చల మాదిరిగా ఏర్పడి, క్రమేపీ పసుపు రంగులోకి మారతాయన్నారు. తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు దుబ్బులో కొన్ని పిలకలు కానీ, దుబ్బు మొత్తం కానీ ఎండిపోతుందని చెప్పారు. దీనినే క్రైసక్ దశ అంటారన్నారు. చాలా మంది రైతులు దీనిని కాండం కుళ్లు, దుబ్బు కుళ్లు తెగులుగా భావించి, శిలీంధ్ర నాసినులు పిచికారీ చేస్తుంటారన్నారు. దీనివల్ల ఖర్చు పెరగడమే కానీ, నివారణ జరగదన్నారు. తెగులు నిర్ధారణ, నివారణకు తీసుకోవలసిన చర్యలను ఆయన వివరించారు.

తెగులు నిర్ధారణకు..

ఆకు ఎండు తెగులు నిర్ధారణకు ఎండిన ఆకులను ముక్కలుగా కత్తిరించి మంచి నీటితో ఉన్న గాజు గ్లాసులో వేయాలి. అరగంట తర్వాత గ్లాసులో ఉన్న నీటిని గమనిస్తే తెగులు ఆశించిన భాగాల నుంచి బాక్టీరియా నీటిలోకి ప్రవేశిస్తాయి. తద్వారా నీటి గాఢత పెరగడంతో పాటు, పసుపు రంగులోకి మారుతుంది. ఈ లక్షణాలను బట్టి ఆ పంటకు ఆకు ఎండు తెగులు ఆశించినట్టు గుర్తించవచ్చు. అదే కాండం కుళ్లు తెగులు ఆశించిన పిలకలను గమనిస్తే, మొదటి కణుపు వద్ద కుళ్లి, మొక్క చనిపోతుంది. అటువంటి పిలకలను చీల్చి పరిశీలిస్తే మొదటి కణుపు వద్ద నల్లగా కనిపిస్తుంది. బాక్టీరియా ఎండు ఆకు తెగులు ఆశించిన మొక్కల్లో అటువంటి కుళ్లు లక్షణాలు కనిపించకుండానే పిలకలు ఎండిపోతాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసినా, ఉష్ణోగ్రత 22 నుంచి 26 సెంటీగ్రేడ్ డిగ్రీలున్నా, అధిక నత్రజని వాడినా, నీడ సోకే ప్రాంతాలు వ్యాధి తీవ్రతను పెంచుతాయి. సాగు నీటి ద్వారా ఒక పొలం నుంచి మరొకదానికి తెగులు వ్యాపించవచ్చు.

నివారణ చర్యలు

వర్షాలు పడే సమయంలో తెగులు లక్షణాలు 5 శాతం కంటే ఎక్కువగా వ్యాపించి ఉంటే, పైపాటుగా వేయవలసిన నత్రజని ఎరువులను తాత్కాలికంగా ఆపి, ఎండలు కాసిన తర్వాత మాత్రమే వేయడం మంచిది. సిఫార్సు చేసిన పొటాష్‌ని మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా నాట్లు వేసే సమయంలోను, చిరు పొట్ట దశలోను వేయాలి. పొలం గట్లపై బాక్టీరియాకు ఆవాసం కల్పించే కలుపు, ఇతర పిచ్చి మొక్కలు లేకుండా చూడాలి. తెగులు లక్షణాలు గమనించిన వెంటనే పొలంలో నిలిచిన నీటిని రెండు, మూడు సార్లు మురుగు కాలువల ద్వారా తీసివేయాలి. కొత్తనీరు పెట్టడం వల్ల తెగులు ఉధృతి తగ్గుతుంది. ఈ తెగులు నివారణకు సరైన మందులు అందుబాటులో లేవు. మానవ ప్రయత్నంగా తెగులు వ్యాప్తిని కొంతవరకు అరికట్టడానికి లీటరు నీటికి 0.5 గ్రా. నుంచి 1.0 గ్రా., స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్, టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్ (ప్లాన్టోమైసిన్), కాపర్ హైడ్రాక్సయిడ్ 2 గ్రా. కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.



తెగులు ఆశించిన వరి పంట

సీజనల్ వ్యాధులతో పెరుగుతున్న ఓపీ



కాలు విరిగిన రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు ప్రదీప్ సుందర్

గోకవరం: సీజనల్ వ్యాధులతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ శాతం రోజురోజుకు పెరుగుతుందని ప్రధాన వైద్యురాలు వనజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోకవరంలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభం నుంచి ఎప్పుడు లేని విధంగా మంగళవారం సుమారు 440 మంది రోగులు వైద్యం అందించామన్నారు. పెరుగుతున్న రోగుల దృష్ట్యా ఆర్థోపెడిక్ వైద్యుడు ప్రదీప్ సుందర్‌ను రెండు రోజులు ఆసుపత్రికి వచ్చేలా నియమించాలని ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో వైద్యులు ఝాన్సీరాణి, రామలక్ష్మి, భార్గవి, వైద్య సిబ్బంది ఉన్నారు.